# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# జాతీయ వార్తలు

తేదీ: 22-02-2026 సమయం : రాత్రి 8గం. 30ని.లు

## ముఖ్యాంశాలు

- ఏడాదికి 15 కోట్ల టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేస్తూ.. భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ “మన్ కీ బాత్” కార్యక్రమంలో తెలిపారు.

- ఉత్తరప్రదేశ్‌లోని మీరట్‌లో “నమో భారత్” రైలుతో పాటు మీరట్ మెట్రో సేవలను ప్రధానమంత్రి ఈరోజు ప్రారంభించారు.

- వ్యవసాయ రంగంలో తక్కువ సమయంలో.. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని కేంద్ర సహాయ మంత్రి జితేంద్ర సింగ్ పేర్కొన్నారు.

- టీ-20 ప్రపంచ కప్ 2026 సూపర్-8 లో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది.

==========================

కృత్రిమ మేథ (AI)ను ప్రపంచం భవిష్యత్‌లో ఎలా వినియోగించుకోవాలో నిర్దేశించడంలో భారత్ వేదికగా జరిగిన “ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్” ఒక కీలక మలుపుగా నిలిచిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఆకాశవాణి ద్వారా తన మనసులోని భావాలను పంచుకునే “మన్ కీ బాత్” 131 సంచిక కార్యక్రమంలో ప్రధానమంత్రి దేశప్రజలను ఉద్దేశించి ఈరోజు ప్రసంగించారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగిన ఏఐ సమ్మిట్ ప్రపంచంలోనే అతిపెద్ద సదస్సుగా నిలిచిందని ప్రధాని తెలిపారు. AI ఆధారిత పశువుల సంరక్షణ విధానం, పురాతన గ్రంథాలను AI ద్వారా పఠనయోగ్యంగా మార్చడం, అనువాదం చేయడం వంటి సాంకేతికతను ప్రపంచ దేశాల నేతలను ఆకట్టుకున్నాయని వివరించారు. డిజిటల్ మోసాల పట్ల ప్రజలు అత్యంత జాగ్రత్తగా ఉండాలని ప్రధాని హెచ్చరించారు. ఏడాదికి 15 కోట్ల టన్నుల బియ్యాన్ని ఉత్పత్తి చేస్తూ.. భారత్ ప్రపంచంలోనే అగ్రగామిగా నిలిచిందని, మన రైతులు నాణ్యతతో పాటు విదేశీ ఎగుమతులపై దృష్టి సారిస్తున్నారని పేర్కొంటూ...

(వాయిస్ 30 సెకన్లు)

రాష్ట్రపతి భవన్‌లో ఎడ్విన్ ల్యూటెన్స్ విగ్రహం స్థానంలో స్వతంత్ర భారత తొలి గవర్నర్ జనరల్ సి.రాజగోపాలాచారి విగ్రహాన్ని ప్రతిష్ఠించనున్నట్లు తెలిపారు. పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు ఆందోళన చెందవద్దని ధైర్యం చెప్పారు. రంజాన్ నెల ప్రారంభం, హోలీ పండుగ సందర్భంగా దేశ ప్రజలకు శుభాకాంక్షలు తెలుపుతూ "వోకల్ ఫర్ లోకల్" మంత్రాన్ని మరోసారి ప్రధానమంత్రి గుర్తు చేశారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృత్రిమ మేధ (AI) ఫలాలను మానవాళి సంక్షేమానికి, ఆర్థిక పురోభివృద్ధికి సమానంగా పంపిణీ చేయాలనే లక్ష్యంతో రూపొందించిన 'న్యూఢిల్లీ డిక్లరేషన్'కు ప్రపంచ దేశాల నుంచి మద్దతు లభించింది. న్యూఢిల్లీలో జరిగిన "ఇండియా ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026" ముగింపు సందర్భంగా ఈ డిక్లరేషన్‌ను 89 దేశాలు, అంతర్జాతీయ సంస్థలు ఆమోదించాయి. పొరుగుదేశం బంగ్లాదేశ్ ఈ జాబితాలో చేరిన 89వ దేశంగా నిలిచింది. "సర్వజన హితాయ.. సర్వజన సుఖాయ" నినాదంతో రూపొందిన ఈ డిక్లరేషన్ పై అమెరికా, రష్యా, చైనా, బ్రిటన్, జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా, బ్రెజిల్, యూఏఈ, సింగపూర్ వంటి దేశాలు సంతకాలు చేశాయి. ఏఐ సాంకేతికతను కేవలం కొన్ని దేశాలకే పరిమితం చేయకుండా.. ప్రపంచ వ్యాప్తంగా సమానంగా వినియోగించుకోవాలనే అంశంపై ఈ దేశాలన్నీ ఏకాభిప్రాయానికి వచ్చాయి.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

తపాలా సేవల్లో పరస్పర సహకారాన్ని మరింత బలోపేతం చేసుకునే దిశగా భారత్-బ్రెజిల్ దేశాలు అవగాహన ఒప్పందం (MoU)పై సంతకాలు చేశాయి. భారత పర్యటనలో ఉన్న బ్రెజిల్ కమ్యూనికేషన్ల శాఖ మంత్రి ఫ్రెడెరికో డి సికీరా ఫిల్హో, కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాలు ఈ ఒప్పంద పత్రాలను మార్చుకున్నారు. ఈ ఒప్పందం ప్రాథమికంగా ఐదేళ్ల పాటు అమల్లో ఉంటుంది. తపాలా వ్యవస్థల ఆధునీకరణ, నెట్‌వర్క్ సామర్థ్యాన్ని పెంచడం ద్వారా ఆర్థిక సమ్మిళితం (Financial Inclusion), మారుమూల ప్రాంతాలకు వేగంగా సేవలను చేరవేయడంపై ఇరు దేశాలు దృష్టి సారించనున్నాయి. తపాలా రంగంలో వస్తున్న అత్యాధునిక మార్పులను అందిపుచ్చుకోవడానికి, రెండు దేశాల మధ్య అనుసంధానతను పెంచడానికి ఈ ఒప్పందం ఎంతో దోహదపడుతుందని కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ పేర్కొంది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

దేశంలోని మారుమూల గ్రామాలకు సేవలను చేరవేయడంలో గ్రామీణ డాక్ సేవకులు (GDS) కీలక పాత్ర పోషిస్తున్నారని, వారే గ్రామీణ భారత్‌కు వెన్నెముక అని కేంద్ర సమాచార శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియా కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరులో నిర్వహించిన `గ్రామీణ డాక్ సేవక్ సమ్మేళ`నాన్ని  ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ లతో కలసి ప్రారంభించారు.  ఈ సందర్భంగా జ్యోతిరాదిత్య సింధియా మాట్లాడుతూ... తపాలా శాఖ ద్వారా ఆర్థిక సమ్మిళితాన్ని (Financial Inclusion) సాధించడంలో డాక్ సేవకుల కృషి అనన్యసామాన్యమని  పేర్కొన్నారు.

విరామం

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఉత్తరప్రదేశ్‌లోని మీరట్ శతాబ్ది నగర్ స్టేషన్‌లో `నమో భారత్` రైలుతో పాటు మీరట్ మెట్రో సేవలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈరోజు ప్రారంభించారు. 82 కిలోమీటర్ల పొడవైన పూర్తి స్థాయి ఢిల్లీ-మీరట్ నమో భారత్ కారిడార్‌ను ప్రధాని జాతికి అంకితం చేశారు. నమో భారత్.. దేశంలోనే మొట్టమొదటి రీజనల్ రాపిడ్ ట్రాన్సిట్ సిస్టమ్. గంటకు 180 కిలోమీటర్ల వేగంతో ఈ రైలు ప్రయాణిస్తుంది. మీరట్ మెట్రో దేశంలోనే అత్యంత వేగవంతమైన మెట్రో వ్యవస్థ. గంటకు 120 కిలోమీటర్ల వేగంతో ఈ మెట్రో రైలు ప్రయాణిస్తుంది. మెట్రో ప్రారంభోత్సవం అనంతరం మీరట్‌లో సుమారు 12 వేల 930 కోట్ల రూపాయల విలువైన వివిధ అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ

ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ… ఈ ప్రాజెక్టులు వికసిత్ ఉత్తరప్రదేశ్.. వికసిత్ భారత్ నిర్మాణానికి ఊతమిస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ మాట్లాడుతూ… ప్రధానమంత్రి ప్రారంభించిన ఈ ప్రాజెక్టులు రాష్ట్ర ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరుస్తాయని పేర్కొన్నారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

కృత్రిమ మేధ (AI) సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవడం ద్వారా భారత వ్యవసాయ రంగం దేశ ఆర్థిక వ్యవస్థకు అదనంగా 70 వేల కోట్ల రూపాయల వరకు తోడ్పాటు అందించగలదని కేంద్ర సైన్స్ అండ్ టెక్నాలజీ శాఖ సహాయ మంత్రి జితేంద్ర సింగ్ వెల్లడించారు. ముంబయిలో జరిగిన “AI ఫర్ అగ్రీ- 2026” సదస్సు ప్రారంభోత్సవంలో ఆయన మాట్లాడుతూ… గ్లోబల్ సౌత్ దేశాల్లో సుమారు 60 కోట్ల మంది ప్రజలు వ్యవసాయంపైనే ఆధారపడి ఉన్నారని తెలిపారు. తక్కువ సమయంలో.. తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి సాధించడంలో ఏఐ కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. వాతావరణ సమాచారాన్ని ఎప్పటికప్పుడు అందించడం, పంటల పనితీరును ముందుగానే అంచనా వేయడం, విపత్తుల సమయంలో ముందస్తు హెచ్చరికలు జారీ చేయడంలో ఈ సాంకేతికత రైతులకు అండగా నిలుస్తుందని జితేంద్ర సింగ్ వివరిస్తూ…

(వాయిస్ 30 సెకన్లు)

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

మహిళల ఆసియా కప్ రైజింగ్ స్టార్స్-2026 టోర్నీలో భారత 'ఎ' జట్టు విశ్వవిజేతగా నిలిచింది. థాయిలాండ్ వేదికగా ఈరోజు జరిగిన ఫైనల్లో భారత్ 46 పరుగుల తేడాతో బంగ్లాదేశ్ 'ఎ' జట్టును ఓడించి ట్రోఫీని కైవసం చేసుకుంది. టాస్ గెలిచి తొలుత బ్యాటింగ్ ఎంచుకున్న భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 135 పరుగులు చేసింది. బంగ్లాదేశ్ 19.1 ఓవర్లలో కేవలం 88 పరుగులకే ఆలౌట్ అయింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

టీ-20 ప్రపంచ కప్-2026 సూపర్-8 గ్రూప్-1 విభాగంలో భాగంగా భారత్, దక్షిణాఫ్రికా జట్ల మధ్య క్రికెట్ మ్యాచ్ జరుగుతోంది. అహమ్మదాబాద్ లోని నరేంద్ర మోదీ స్టేడియం వేదికగా జరుగుతున్న మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ప్రారంభించిన దక్షిణాఫ్రికా 16 ఓవర్లకు 5 వికెట్ల నష్టానికి 152 పరుగులు చేసింది. అంతకుముందు గ్రూప్-2 విభాగంలో భాగంగా శ్రీలంకలోని పల్లకెలె స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో శ్రీలంకపై ఇంగ్లాండ్ 51 పరుగుల తేడాతో విజయం సాధించింది.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =

ఒడిశా, తూర్పు మధ్యప్రదేశ్, విదర్భ, ఛత్తీసగఢ్‌తో పాటు అండమాన్ నికోబార్ దీవుల్లో రేపు వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం (IMD) తెలిపింది. రాబోయే రెండు రోజుల్లో తెలంగాణ, అస్సాం, మేఘాలయ, గంగానది పరీవాహక పశ్చిమ బెంగాల్ ప్రాంతాల్లోనూ ఇదే తరహా వాతావరణం నెలకొంటుందని IMD అధికారులు తెలిపారు.

= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =
= = = = = = = = = = = = = = = = = = = = = = = = = =